# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-03-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సి విజిల్ యాప్ ద్వారా అందే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.**

**2. అంతరిక్షంలోకి ఉపగ్రహాలను ప్రయోగించిన వాహక నౌకలను తిరిగి వినియోగించేందుకు చేపట్టిన 'ఆర్ఎల్వీ ఎల్ ఈ ఎక్స్-02 ప్రయోగాన్ని ఇస్రో విజయవంతంగా నిర్వహించింది.**

**3. బ్యాంకుల నుంచి లక్ష రూపాయలు అంతకుమించి చేపట్టిన లావాదేవీలపై నిఘా పెట్టాలని రాష్ట్రాలకు కేంద్ర ఎన్నికల సంఘం లేఖ రాసింది.**

**4. తెలుగుదేశం పార్టీ మూడవ జాబితాలో 11 శాసనసభ స్థానాలు, 13 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది.**

**5. రాష్ట్రంలోని న్యాయ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే లాసెట్ నోటిఫికేషన్ విడుదలైంది.**

==========================

చట్టబద్ధమైన విధానాన్ని అనుసరిస్తూ ఈ నెల 26 వ తేదీ కల్లా ఫార్మ్-7,8లను పరిష్కరించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలుపరిచే అంశానికి సంబంధించి అన్ని జిల్లా ఎన్నికల అధికారులతో రాష్ట్ర సచివాలయం నుండి ఆయన ఈ రోజు దృశ్య మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించి మాట్లాడుతూ...పోలింగ్ కేంద్రాలలో కనీస వసతులు కల్పించాలనీ, సి విజిల్ యాప్ ద్వారా అందే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలనీ సూచించారు. ఎలక్ట్రానిక్ సీజన్ మేనేజ్‌మెంట్ విధానాన్ని పటిష్టంగా అమలుపరచాలని ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.

--------------------------

అంతరిక్షంలోకి ఉపగ్రహాలను ప్రయోగించిన వాహక నౌకలను తిరిగి వినియోగించే ప్రక్రియలో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ-ఇస్రో మరో ముందడుగు వేసింది. ఇస్రో తయారు చేసిన 'రీయూజబుల్ లాంచ్ వెహికల్ 'ఆర్ఎల్వీ ఎల్ ఈ ఎక్స్-02 అటానమస్ ల్యాండింగ్ ప్రయోగాన్ని ఈ ఉదయం కర్ణాటకలోని చిత్రదుర్గ

జిల్లా ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్ నుండి విజయవంతంగా నిర్వహించింది. దీంతో దేశ సాంకేతిక సామర్థ్యాలను విస్తృతం చేసుకోవడంతో పాటు అంతరిక్ష యాత్రల ఖర్చును భారీగా తగ్గించుకునేందుకు ఈ ప్రయోగం దోహదపడనుంది.

రెక్కలతో తయారు చేసిన ఈ ఆర్ఎల్వీకి ఇస్రో 'పుష్పక్' గా నామకరణం చేసింది. గత ఏడాది ఆర్ఎల్వీ ఎల్ ఈ ఎక్స్-01ను పూర్తి చేసిన ఇస్రో (ISRO).. స్వతంత్ర ల్యాండింగ్లో పుష్పక్ సామర్థ్యాన్ని ఎల్ ఈ ఎక్స్-02 ద్వారా మరోసారి పరీక్షించింది. అత్యంత కచ్చితత్వంతో ఈ వాహక నౌక స్వయంగా రన్వేపైకి దిగడం విశేషం.

---------------------------

బ్యాంకుల నుంచి లక్ష రూపాయలు అంతకుమించి చేపట్టిన లావాదేవీలపై నిఘా పెట్టాలని రాష్ట్రాలకు కేంద్ర ఎన్నికల సంఘం లేఖ రాసింది. బ్యాంకు ఖాతాల నుంచి తీసుకున్నా, జమ చేసినా అందుకు సంబంధించిన వివరాలను ఆరా తీయాలని ఆదేశించింది. ఎన్నికలపై నగదు ప్రభావాన్ని కట్టడి చేసేందుకు అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా లోక్ సభతో పాటు కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఈ మేరకు లేఖ రాసింది. ఎన్నికల సమయంలో ఒకే బ్యాంకు బ్రాంచి నుంచి వేర్వేరు ఖాతాలకు నగదు బదిలీ చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ మేరకు చర్యలు తీసుకోవాలని సూచించింది.

---------------------------

రైల్వే స్టేషన్లలో జనరల్ టికెట్ బుకింగ్ కౌంటర్ల వద్ద నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించడమే లక్ష్యంగా క్యూఆర్ కోడ్ ద్వారా నగదు చెల్లించే సౌలభ్యాన్ని దక్షిణ మధ్య రైల్వే అందుబాటులోకి తీసుకొచ్చింది. తాజా నిర్ణయంతో ప్రయాణికులకు కౌంటర్ల వద్ద ఎదురయ్యే నగదు ఇబ్బందులు తప్పనున్నాయి. అన్‌రిజర్వ్డ్, ప్లాట్‌ఫాం టికెట్ల కొనుగోలుకు రైల్వేస్టేషన్లలో ఇప్పటికే ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషిన్ ద్వారా నగదు చెల్లించే సౌకర్యం ఉంది. తాజాగా జనరల్ బుకింగ్ కౌంటర్లలోనూ నగదు రహిత లావాదేవీలకు అనుగుణంగా మార్పులు చేయడంతో అన్ రిజర్వ్ టిక్కెట్లు కొనుగోలు మరింత సులభతరం కానున్నాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేసిన వ్యక్తి గురించి అధికార పార్టీ నాయకులకు సమాచారం ఇచ్చిన ఇద్దరు ఉద్యోగులను విధుల నుంచి తొలగించారు. ఏలూరు జిల్లా చేబ్రోలు గ్రామ సచివాలయం-1 పంచాయతీ కార్యదర్శి బి.వి.రవిచంద్ర, ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ అమృతను సస్పెండ్ చేస్తూ నిన్న ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఉంగుటూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి శర్మకు షోకాజ్ నోటీసు జారీ చేశారు.

---------------------------

సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న గర్భవతులు, బాలింతల కోసం అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ జి.వెంకటలక్ష్మి తెలిపారు. చిన్న పిల్లలతో వచ్చే బాలింతలకు పోలింగ్‌బూత్ వద్ద ప్రత్యేకంగా ఫీడింగ్ రూమ్ ఏర్పాటు చేయాలని, గర్భవతులకు అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె ఎన్నికల సంఘాన్ని కోరారు. పోలింగ్ తేదీ నాటికి పెరిగే ఉష్ణోగ్రతలు దృష్టిలో పెట్టుకుని మహిళలు వడదెబ్బకు గురి కాకుండా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద షెల్టర్, మంచినీరు, ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. కొన్ని అత్యవసర సందర్భాల్లో మహిళలపై దాడులు, అత్యాచారాలు, వేధింపులు, తదితర విషయాల్లో

వారికి తగు న్యాయం చేయడానికి, బాధితులను పరామర్శించడానికి మహిళా కమిషన చైర్ పర్సన్, మెంబర్లకు ఎన్నికల నిబంధనల్లో సడలింపు ఇవ్వాలని కోరామని.. ఆమె ఒక ప్రకటనలో తెలిపారు.

---------------------------

లోక్‌సభ, శాసనసభ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల మూడవ జాబితాను తెలుగుదేశం పార్టీ విడుదల చేసింది. 11 శాసనసభ స్థానాలతో పాటు 13 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ఆ పార్టీ ప్రకటించింది. జనసేన, భారతీయ జనతా పార్టీలతో పొత్తులో భాగంగా 144 అసెంబ్లీ, 17 పార్లమెంట్ స్థానాల్లో తెలుగుదేశం పార్టీ పోటీ చేయనుంది. ఇదివరకే 128 శాసనసభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా.. తాజాగా మరో 11 మందిని వెల్లడించింది. 5 అసెంబ్లీ, 4 ఎంపీ స్థానాలను ఇంకా ప్రకటించవలసి ఉంది.

---------------------------

రాష్ట్రంలోని న్యాయ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే లాసెట్ నోటిఫికేషన్ ను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విడుదల చేసింది. 3, 5 ఏళ్ల లాడీ కోర్సులు, 2 ఏళ్ల పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ పరీక్ష నిర్వహిస్తారు. విద్యార్థులు ఈ నెల 26 వ తేదీ నుంచి ఏప్రిల్ 25 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. జరిమానాతో మే 29 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ 3 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పిస్తారు. జూన్ 9న ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తారు.

---------------------------

ఎన్నికల నియమ నిబంధనలను రాజకీయ పార్టీ నాయకులు ఖచ్చితంగా పాటించాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి అతిథి సింగ్ సూచించారు. తిరుపతిలో ఆమె ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైనా ప్రవర్తిస్తే ఎన్నికల కమిషన్ చట్టం ప్రకారం తగుచర్యలు ఉంటాయని హెచ్చరించారు. తిరుపతి నియోజకవర్గ పరిధిలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ఓటు హక్కు వినియోగంపై పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తున్నామని అతిథి సింగ్ పేర్కొంటూ....

**....వాయిస్... 22 సెకన్లు....**

---------------------------

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భద్రతపై ప్రజలకు భరోసా కల్పించేందుకు శ్రీ సత్యసాయి జిల్లాలోని వివిధ పట్టణాలలో సాయుధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామని జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఎస్పీ మాధవ్ రెడ్డి తెలిపారు. పెనుగొండ, తలుపుల ప్రాంతాలలో నిన్న కవాతు నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికలు ప్రశాంతంగా వాతావరణంలో నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలలో పీహెచ్ డీ సీట్ల భర్తీకి మే 2 వ తేదీ నుంచి 5 వ తేదీ వరకు APRCET నిర్వహించనున్నట్లు సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దేవరాజులు తెలిపారు. ఈ నెల 19తోనే దరఖాస్తు గడువు ముగియగా, ఈ నెల 29 వరకు 2వేల రూపాయలు, ఏప్రిల్ 6 వ తేదీ వరకు 5వేల రూపాయల అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఏప్రిల్ 10 వ తేదీ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని దేవరాజులు వెల్లడించారు.

---------------------------

భద్రాచలం శ్రీ సీతారాముల కళ్యాణోత్సవ పనులకు ఈ నెల 25వ తేదీన శ్రీకారం చుట్టనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉత్తర ద్వారం వద్ద ప్రత్యేక పూజలు చేసి, పసుపు కొమ్ములు దంచుతారనీ, అలాగే తలంబ్రాలు కలిపే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారనీ పేర్కొన్నారు. ఈ ఏడాది 200 క్వింటాళ్ల మేర తలంబ్రాలు కలిపేందుకు సన్నాహాలు చేస్తుండగా.. నవమి రోజున వీటిని భక్తులకు ఉచితంగా పంపిణీ చేస్తారు. ఏప్రిల్ 17వ తేదీన శ్రీరామనవమి, 18వ తేదీన పట్టాభిషేక మహోత్సవం జరగనుంది.

========================